వైఎస్సార్‌సీపీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


కుమరాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

జామి: ఉత్తరాంధ్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని అట్టాడ, కుమ రాం, ఎం.కె.వలస, ఎ.ఆర్.పేట, లొట్లపల్లి, జన్నివలస, వెన్నె, వి.ఆర్.పాలెం, శాశనపల్లి గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గృహసారథులతో సమావేశం

గృహసారథులే పార్టీకి విజయసారథులని, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల18 నుంచి ప్రారంభమయ్యే 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ, పార్టీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు గుడివాడ రాజేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని వెదురువాడ, కొత్తపాలెం,మరువాడ, కె.గుమడాం, ఎం.కొత్తవలస, జి.పి. అగ్రహారం, చిన్నతామరాపల్లి, బి.రాజేరు, దేవుపల్లి, గొల్లుపాలెం గ్రామాల్లో శనివారం నిర్వహించే ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని ఎంపీపీ చల్ల చలంనాయుడు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్‌పై నమ్మకంతోనే విశాఖకు పారిశ్రామిక దిగ్గజాలు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పారిశ్రామిక దిగ్గజాలు తరలివచ్చారని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గర్భాంలో పట్టభద్రులతో శుక్రవారం ఆయన సమావేశమై మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడం, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రపై ఉన్న అభిమానంతో విశాఖపట్నంను పరిపాలన రాజధానిగా ప్రకటించడంతో పాటు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడాన్ని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం కృషిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి. రమణరాజు, కోట్ల విశ్వేశ్వరరావు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల మోతీలాల్‌నాయుడు, కె.ఎస్.ఆర్.కె. ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, సత్తారు జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం


వేపాడ: సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

వేపాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు కోరారు. సోంపురం గ్రామంలో శుక్రవారం చేపట్టిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచరంలో ఆయన పాల్గొన్నారు. పట్టభద్ర ఓటర్ల ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సుధాకర్‌ను గెలిపించి సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, నాయకులు అడపా ఈశ్వరరావు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ బి.శ్రీను పాల్గొన్నారు.

గుర్ల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు తొలిప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు కోరారు. మండలంలోని చింతలపేటలో శుక్రవారం ప్రచారం చేశారు. అలాగే గుజ్జింగివలస, గుర్ల, చోడవరం, పాలవలస గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, తాటిపూడి, గొలగాం, చిన్ననాగళ్లవలసలో బెల్లాన బంగారునాయుడు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.

కొత్తవలస: మండలంలోని చిన్నరావుపల్లి, కంటకాపల్లి, కాటికాపల్లి, మంగళపాలెం గ్రామాల్లో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పట్టభద్ర ఓటర్ల ఇంటికి వెళ్లి పార్టీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, కంటకాపల్లి సర్పంచ్ కృష్ణ, బొంతల వెంకటరావు, మేలాస్త్రీ అప్పారావు, సింగంపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు 29 మంది అధ్యాపకుల కేటాయింపు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 23 మంది రెగ్యులర్ అధ్యాపకులను, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఆరుగురు అధ్యాపకులను ప్రభుత్వం నియమించిందని, వారు త్వరలోనే విధుల్లో చేరనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రావాడ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులకు ఒక్కొక్కరు చొప్పున, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్స్ తదితర సబ్జెక్టులకు ఇద్దరు చొప్పున అధ్యాపకులను కేటాయించిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మొత్తం 29మంది అధ్యాపకులను కేటాయించినందుకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, విద్యాశాఖ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

కమనీయం.. వేంకటేశ్వర స్వామి కల్యాణం

కొత్తవలస: స్థానిక కుమ్మరివీధిలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆనందాశ్రమంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ధర్మకర్త తీగెల సన్యాసిగుప్త ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోశ్చరణల మధ్య స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు.

ఘనంగా ఎర్రయ్యమ్మ పేరంటాలు తీర్థం

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామంలో ఎర్రయ్యమ్మ పేరంటాలు 60వ వర్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పేరంటాలకు గ్రామస్తులంతా పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం చేపట్టిన గుర్రాల పరుగు పందెం పోటీలు ఉత్కంఠగా సాగాయి. విజేతలకు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు యడ్ల కిశోర్‌కుమార్ బహుమతులు అందజేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన

శృంగవరపుకోట: స్థానిక రవీంద్రభారతి పాఠశాల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శుక్రవారం ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యం విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని, విద్యాసంవత్సరం పూర్తికాకుండానే 10వ తరగతి పుస్తకాలు అమ్ముకుంటున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్నారని ఆందోళన చేపట్టారు. 10వ తరగతి పుస్తకాలు స్టోర్ చేసిన గదికి తాళం వేసి, ఎంఈఓ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఎంఈఓ అక్కడకు చేరుకుని స్టోర్ రూంలో భద్రపరిచిన పదో తరగతి పుస్తకాలను తన కార్యాలయానికి తరలించారు.

ఆలోచనతో ఓటు వేయండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

• ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో పట్టభద్రులంతా ఆలోచనతో ఓటు వేయాలని, సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని దేవాంగులవీధి, కుమ్మరివీధి, సెగిడివీధి, అడ్డురివీధి, కొత్తఅగ్రహారం, రిక్షా కాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో శుక్రవారం సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, పేద విద్యార్థుల కోసం ఫీజు రీఇంబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్య, లానేస్తం, విద్యాకానుక వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆలోచనతో ఓటు వేసి సీతంరాజును గెలిపిస్తే యువతకు మేలు జరుగుతుందన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పట్టణ అధ్యక్షుడు పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర గొంతు వినిపించాలి

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


శృంగవరపుకోట: ధర్మవరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించం ద్వారా ఇక్కడి ప్రజల ఆకాంక్షను ప్రపంచానికి చాటాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, ఇందుకూరి సుధారాజు, స్టేట్ డైరెక్టర్ వి.రాంబాబు, సర్పంచ్‌లు కె.వెంకటరావు, జుత్తాడ సూర్యారావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వెంకటరావు, మహాలక్ష్మినాయుడు, తగరంపూడి రమణ తదితరులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగాలంటే విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు పట్టభద్రులు మద్దతుగా నిలవాలని కోరారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

మర్రిపాలెం (విశాఖ ఉత్తర): ఆర్థిక ఇబ్బందులు తాళలేక విశాఖలోని రైల్వే ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీవీఎంసీ 53వ వార్డు రైల్వే క్వార్టర్స్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. గజపతినగరానికి చెందిన లక్ష్మణ్ (47) మర్రిపాలెం రైల్వే డీజిల్ లోకో షెడ్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యా, పిల్లలతో గొడవలు పడుతుండేవాడు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంటకు ఇంటికి వచ్చి నిద్రపోయాడు. తర్వాత ఇంట్లో ఉన్న పూజ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం భార్యా పిల్లలు చూసేసరికి అక్కడ లేకపోవడంతో అలవాటు ప్రకారం మద్యం సేవించి వేరే గదిలో నిద్రపోతున్నాడని అనుకున్నారు. సుమారు 11 గంటల ప్రాంతంలో అనుమానం వచ్చి తలుపులు కొట్టగా ఎంతకీ తీయకపోవడంతో ఇరుగు పొరుగు సాయంతో తలుపులు బద్దలుకొట్టి చూసేసరికి ఫ్యాను హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి 9 ఏళ్ల కుమార్తె, 8 ఏళ్ల కుమారుడు ఉన్నారు. ఏఎస్‌ఐ వాసుదేవరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాడిపశువులకు గాలికుంటు టీకాలు


జామి: పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి అప్పలనాయుడు

వేపాడ: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఆర్‌బీకేల పరిధిలో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్నామని, పాడిరైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి సింహాచలం కోరారు. వేపాడ పశువైద్య కేంద్రంలో శుక్రవారం పాడిపశువులకు టీకాలు వేశారు. నాలుగు నెలలు నిండిన పశువులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

జామి: మండలంలోని జామి, అలమండ, తాండ్రంగి గ్రామాల్లో పాడిపశువులకు పశువైద్య సిబ్బంది శుక్రవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు అప్పలనాయుడు, నరేష్, గీతారాణి పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్, రిసోర్స్ పర్సన్

చీపురుపల్లి రూరల్: గరివిడి అవంతీస్ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కాలేజీలో విజయనగరం క్వాలిటీ ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో బి.టెక్, డిప్లొమా, ఈసీఈ విద్యార్థులకు ఎల్‌ఈడీ టీవీ తయారీ, రూపకల్పనపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. అధునాతన టెక్నాలజీతో టెలివిజన్ రంగంలో జరిగిన మార్పులను రిసోర్స్ పర్సన్ జి.మహేష్ విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరిచేందుకు ఇటువంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, ఈసీఈ విభాగాధిపతి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

దత్తిరాజేరు: వేసవి దృష్ట్యా తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా గ్రామాల్లో బోర్లను బాగు చేయిస్తున్నామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మరడాం, మర్రివలస గ్రామాల్లో పాడైన బోర్లను శుక్రవారం మెకానిక్‌లతో బాగు చేయించారు. బోర్లు పాడైన వెంటనే సర్పంచ్‌లు తమకు సమాచారం అందించాలని కోరారు.

క్లుప్తంగా

టెన్త్‌లో శతశాతం ఫలితాలు సాధించాలి

• డీఈఓ లింగేశ్వరరెడ్డి


ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

గజపతినగరం రూరల్: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని మరుపల్లి ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, స్థానిక ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పరీక్షల సన్నద్ధతను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఆధార్ అప్‌డేట్ వేగవంతం చేయాలి


సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: మండలంలో సోంపురం సచివాలయాన్ని ఎంపీడీఓ బీఎస్ఎస్‌కే పట్నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆధార్ అప్‌డేట్, సఖి, ఆయుష్మాన్ భారత్ తదితర కార్యక్రమాల అమలుపై సిబ్బందితో సమీక్షించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఈ–సర్వీసులు అందించాలన్నారు. ఆధార్ అప్‌డేట్ వేగవంతం చేయాలని సూచించారు. బాల్యవివాహాల నిర్మూలన, బాలికల విద్యపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

నవధాన్యాల సాగుతో నేలకు మేలు


ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

వేపాడ: నవధాన్యాలు సాగు చేసి భూమిలో కలియదున్నటం వల్ల భూమి సారవంతంగా తయారవుతుందని, పంటకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సన్యాసమ్మ అన్నారు. చినగుడిపాలలో శుక్రవారం ఉపాధిహామీ వేతనదారులకు నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఎకరా పొలంలో 13 కేజీల పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయటం వల్ల 10 టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుందన్నారు. దీని వల్ల నేలలో జీవవైవిధ్యంతో పాటు నీటిని పట్టిఉంచే సామర్థ్యం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట పశువులకు మేతగా కూడా ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.రామునాయుడు, వీఏఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


సీతమ్మవారి సారె ఊరేగింపులో సర్పంచ్ చిన్నమ్ములు దంపతులు, గ్రామస్తులు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో సీతారామ ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. సర్పంచ్ బుద్దా చిన్నమ్ములు, అప్పలనాయుడు దంపతులు సీతమ్మవారికి పండ్లు, స్వీట్లు సారె వస్తువులను ఊరేగింపుగా తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య పండితులు సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణం సందర్భంగా సోంపురం, ఎల్.కోట సీతారాంపురం మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

క్వారీ కార్మికుల ధర్నా

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం సమీపంలో గల దాడి భాస్కర్ మినరల్స్ క్వారీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారయణ డిమాండ్ చేశారు. క్వారీల్లో పనిచేస్తున్న సుమారు 150 మంది కార్మికులు శుక్రవారం ధర్నాకు దిగారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా క్వారీలో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టాలను వర్తించకపోవడం దారుణమ్మన్నారు. కార్మికుల డిమాండ్లు రెండు నెలల్లో నెరవేర్చాలని, లేనియడల ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్తంగా..

పోలింగ్ కేంద్రంలో వసతుల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, తహసీల్దార్

గజపతినగరం: ఈ నెల13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను సీఐ ఎల్. అప్పలనాయుడు, తహసీల్దార్ ఎం.అరుణకుమారి శుక్రవారం పరిశీలించారు. స్థానిక బాలుర హైస్కూల్ సమీపంలో 99, 100 పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

భూ సర్వేను సద్వినియోగం చేసుకోండి

చీపురుపల్లి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.సురేష్ సూచించారు. మండలంలోని అలజంగి గ్రామంలో జరుగుతున్న భూ సర్వేని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో సతమతమవుతున్న రైతులకు ఈ సర్వే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులు రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. రైతుల సమక్షంలోనే సర్వే చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

ప్రతి విద్యార్థీ కనీసం డిగ్రీ వరకు చదువుకోవాలి

గంట్యాడ: ప్రతీ విద్యార్థి కనీసం డిగ్రీ వరకు చదువుకోవాలని, తద్వారా తన కుటుంబాన్ని పోషించుకునే స్థాయికి ఎదగాలని సామాజిక పరివర్తన మార్పు, సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయకర్త బి.రామకృష్ణ అన్నారు. మండలంలోని పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రక్తహీనత బారిన పడకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

గజపతినగరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మెరుగైన వైద్య సేవలందించాలి


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్

బొండపల్లి: పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ అన్నారు. దేవుపల్లి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నాడు–నేడు క్రింద ఆస్పత్రులను ఆధునీకరిస్తోందని అన్నారు. సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసి రోగులకు సేవలందించాలని, మందుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎ.వేదవతి ఉన్నారు. అనంతరం గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఉగాది నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని లబ్ధిదారులకు సూచించారు.

ఎండీఎం కార్మికుల నిరసన

జామి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు ఆధ్వర్యంలో ఎండీఎం కార్మికులు ఎంఈఓ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, ప్రతీ నెల సకాలంలో వేతనాలు చెల్లించాలని, సరుకులను ప్రభుత్వమే సమకూర్చాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ జయశ్రీకి అందజేశారు.

ఈయూ కార్మికుల ధర్నా

శృంగవరపుకోట: సమస్యల పరిష్కారం కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఈయూ రాష్ట్ర కార్యదర్శి పి.భానుమూర్తి మాట్లాడుతూ ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఓటీ, నైట్ అవుట్ అలవెన్స్‌లు చెల్లించాలని, జీఓ 114 ప్రకారం అలవెన్సులు ఇవ్వాలని, 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, డిపోలో, వర్క్‌షాప్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.